సాక్షి విశాఖపట్నం

బుధవారం । 26 । మార్చి । 2025



చీకటి బతుకులు IIలో



పర్యవేక్షణ లోపం.. రోగులకు శాపం IIలో

ఇఫ్తార్ సోమ 6.09 సహర్ మంగళ 4.43

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

గవర్నర్‌కు సాదర వీడ్కోలు



విశాఖ విమానాశ్రయం లోపలకు వెళ్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు

గోపాలపట్నం: రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఇక్కడి నుంచి ఇండిగో విమానంలో విజయవాడ బయలుదేరారు. అధికారులు వారికి సాదరంగా వీడ్కోలు పలికారు.

గంగవరం పోర్టుకు సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు

పెదగంట్యాడ: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) సదరన్ రీజియన్ నిర్వహించిన 4వ ఎడిషన్ ఆంధ్రప్రదేశ్ సేఫ్టీ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2024లో అదానీ గంగవరం పోర్టుకు సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డు లభించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ మాదిరెడ్డి ప్రతాప్ చేతుల మీదుగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు అవార్డును అందుకున్నారు.

డ్రైవింగ్ రీసెర్చ్, ట్రైనింగ్ సెంటర్లకు దరఖాస్తులు

గోపాలపట్నం: జిల్లా పరిధిలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ సెంటర్ అండ్ రీసెర్చ్(ఐడీటీఆర్), రీజనల్ డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు(ఆర్‌డీటీసీ), డ్రైవింగ్ శిక్షణ కేంద్రా(డీటీసీ)ల ఏర్పాటుకు రవాణా శాఖ మార్గదర్శకాలు జారీ చేసినట్లు ఇన్‌చార్జి డీటీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, దరఖాస్తు చేసుకోవాలని కోరారు. http://www.morth.nic.in/ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వీటిలో ఇప్పటికే శిక్షణ పొందిన వారికి ప్రత్యేకంగా డ్రైవింగ్ టెస్ట్ అక్కర్లేదన్నారు.

బాధితులకు రూ.1.5 లక్షలు అందజేత

విశాఖ సిటీ: రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ముగ్గురు బాధితులకు రూ.1.5 లక్షలు పరిహారం అందజేశారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన గొంతిన అచ్చిబాబు, బర్లంగి వెంకటరమణ, గట్టు తులసిబాయ్‌లకు ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 24 మంది బాధితులకు రూ.22.5 లక్షల పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అందించినట్లు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ఎవరికైనా సహాయం కోసం రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రంలో గానీ, టోల్‌ఫ్రీ నెంబర్ 7995095793కు సంప్రదించాలని సూచించారు.

మరణించి మరొకరికి వెలుగునిచ్చి..



శ్రీరాములు నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలుపుతున్న కుటుంబ సభ్యులు

పెందుర్తి: మరణించిన తరువాత కూడా ఒకరికి కంటి చూపునందించాడు ఓ పెద్దాయన. పెందుర్తి జేఎస్ఎన్ఎంయూఆర్ఎం కాలనీలో ఉంటున్న గోదావరి శ్రీరాములు అనే వ్యక్తి మంగళవారం మృతి చెందగా.. అతని నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చొరవతో ఎల్‌వీ ప్రసాద్ నేత్రాలయం మొహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు కార్నియా సేకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను, సభ్యుడు శీరపు మహేశ్వరరావు పాల్గొన్నారు.

● తీరం గుండె'కోత'కు అడ్డుకట్ట



విశాఖ సాగరతీరం ఏటా కోతకు గురవుతోంది. దీని కారణంగా తీరం క్రమంగా తగ్గిపోవడం, తీర ప్రాంతంలోని కట్టడాలకు ముప్పు వాటిల్లుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి, విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సముద్ర గర్భం నుంచి ఇసుకను వెలికి తీసి, పైపుల ద్వారా తీరానికి తరలిస్తోంది. కోతకు గురైన ప్రాంతాల్లో పోస్తుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన డ్రెడ్జర్‌ను డీసీఐ ఉపయోగిస్తోంది. ప్రస్తుతం కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం సమీపంలో ఈ పనులు జరుగుతున్నాయి.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

● పాట కలిపింది.. పాదం కదిలింది



చల్లని సాయంత్రం వేళ.. బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద మంగళవారం ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించి సందడి చేశారు. పాపులర్ పాటలకు స్టెప్పులు వేస్తూ కేరింతలు కొట్టారు. వారి నృత్య ప్రదర్శనకు ఆకర్షితులైన పుణేకు చెందిన ఒక వైద్యురాలు కూడా యువతతో కలిసి డ్యాన్స్‌లు వేశారు. దీంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కారాగారంలో విజ్ఞాన కాంతులు



జ్ఞానసాగర్ గ్రంథాలయం

- ఖైదీల విద్యా వికాసానికి కృషి
- ఖర్చంతా జైలు సంక్షేమ నిధి నుంచే..
- విద్యా కేంద్రంగా విశాఖ సెంట్రల్ జైలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం శిక్షా కేంద్రంగానే కాకుండా.. విద్యా కేంద్రంగానూ రూపాంతరం చెందుతోంది. నేరాల చీకటిలో మగ్గుతున్న ఖైదీలకు విద్య ద్వారా కొత్త జీవితాన్ని వెలిగించే ప్రయత్నం జరుగుతోంది. కారాగారం నాలుగు గోడల మధ్యనే ప్రాథమిక విద్య నుంచి పోస్ట్–గ్రాడ్యుయేషన్ వరకు చదువుకునే సౌకర్యం ఉండటం విశేషం. 2024–25 విద్యా సంవత్సరంలో 120 మంది ఖైదీలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో 90 మంది ప్రాథమిక విద్యను పూర్తి చేస్తుండగా.. 19 మంది పదో తరగతి ఓపెన్ పరీక్షలు రాస్తున్నారు. 11 మంది ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలను రాశారు. అంతేకాకుండా ఆసక్తి ఉన్న ఖైదీలు ఖాళీ సమయాల్లో చదువుకుంటూ డిగ్రీలు పొందుతున్నారు. కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు, వివిధ వృత్తుల్లో ఇక్కడ ఖైదీలు శిక్షణ పొందుతున్నారు. గతంలో ఇక్కడ శిక్ష అనుభవించిన ఒక ఖైదీ పీజీ పూర్తి చేసి బంగారు పతకం సాధించడం విశేషం. పని చేస్తూనే చదువుకునే వెసులుబాటు ఉండటంతో, శిక్ష పూర్తయిన అనంతరం విద్యావంతులుగా బయటకు వస్తున్న ఖైదీల సంఖ్య పెరుగుతోంది.

అన్నీ జ్ఞానసాగర్‌లోనే..

జైలు లోపల 'జ్ఞానసాగర్' పేరుతో విద్యాలయం ఉంది. ఇక్కడ గ్రంథాలయం, తరగతి నిర్వహణ, విద్యా బోధన, పరీక్షల నిర్వహణ తదితర సౌకర్యాలు ఉన్నాయి. రిమాండ్‌లో ఉన్న ఖైదీలు, శిక్ష పడిన ఖైదీలు ఇక్కడ చదువుకుని పరీక్షలు రాయవచ్చు. చదువు లేని వారికి వయోజన విద్య ద్వారా అక్షరజ్ఞానం కలిగిస్తున్నారు. వారికి ప్రాథమిక స్థాయి నుంచి చదవడం, రాయడం నేర్పుతున్నారు. ఇందుకోసం జైళ్ల శాఖ ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించింది. ఈ ఉపాధ్యాయుడు ఖైదీల విద్యా సంబంధిత విషయాలన్నింటినీ చూసుకుంటారు. ఖైదీలు పరీక్షలకు దరఖాస్తు చేసినప్పటి నుంచి వారికి తరగతులు నిర్వహించడం, సందేహాలు తీర్చడం, పరీక్షలు నిర్వహించడం వరకు అతనే ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. తరగతులు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతాయి.

ఖైదీల్లో మార్పు కోసం..



ఖైదీల్లో పరివర్తనం సాధించడానికి చదువు ఉపయోగపడుతుంది. విచక్షణ కల్పించడానికే ఇక్కడ ఖైదీలను విద్యావంతులను చేసే ప్రయత్నం చేస్తున్నాం. ప్రత్యేకంగా నియమించిన ఉపాధ్యాయుడు ద్వారా వారికి బోధన జరుగుతోంది. ఖైదీల చదువుకు అయ్యే ఖర్చు, పరీక్ష ఫీజులను జైలు సంక్షేమ నిధి నుంచే చెల్లిస్తున్నాం. చదువు మధ్యలో నిలిపివేసి జైలుకు వచ్చినవారు.. ఇక్కడ **చదువు కొనసాగించుకోవచ్చు.**

- ఎస్.సాయిప్రవీణ్, జైలు డిప్యూటీ సూపరింటెండెంట్

ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే..

ఇక్కడ ప్రతి సంవత్సరం చదువుకున్న ఖైదీల సంఖ్య మారుతూ ఉంటుంది. కొత్త వారు రావడం, శిక్ష పూర్తయిన వారు వెళ్లిపోవడం వల్ల ఈ సంఖ్యలో మార్పు ఉంటుంది. గడిచిన ఐదేళ్లలో మొత్తం 55 మంది ఖైదీలు ఓపెన్ పదో తరగతిలో చేరారు. 20 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. డిగ్రీ స్థాయిలో బీఏ కోర్సును 29 మంది పూర్తి చేయగా, ఒకరు పీజీలో ఎంఏ పరీక్షలు రాశారు.



జైలులో ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఖైదీలు(ఫైల్)

- 2020–21లో 80 మంది ప్రాథమిక విద్య, 26 మంది ఓపెన్ టెన్త్, 14 బీఏ చదువుకున్నారు.
- 2021–22లో 90 మంది ప్రాథమిక విద్య, 10 మంది ఓపెన్ టెన్త్, 9 మంది బీఏ విద్యనభ్యసించారు.
- 2022–23లో 82 మంది ప్రాథమిక విద్య, ఆరుగురు బీఏ, ఒకరు ఎంఏ చదివారు.
- 2023–24లో 80 మంది ప్రాథమిక విద్య, 9 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ చదివారు.
- 2024–25 (ప్రస్తుతం)లో 90 మంది ప్రాథమిక విద్య కొనసాగిస్తుండగా, 19 మంది ఓపెన్ టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. 11 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు.

ఖజానా ఖాళీ!

- ఉద్యోగుల జీతాలు మినహా అన్ని బిల్లులు కట్
- కాంట్రాక్టర్ల బిల్లులు, ఇతర చెల్లింపులన్నీ బంద్
- బోసిపోతున్న ఖజానా కార్యాలయం



పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ర్యాలీ చేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు

మహారాణిపేట : సంపద సృష్టికర్త హయాంలో ఖజానా ఖాళీ అయిపోయింది. ఉద్యోగుల జీతాలు, **పింఛన్ల మినహా మిగిలిన** అన్ని బిల్లులు మురిగిపో**తున్నాయి. కాంట్రాక్టర్ల** బిల్లులతో పాటు ఇతర **చెల్లింపులన్నీ బంద్** అయిపోయాయి. సాధారణం**గా ఆర్థిక సంవత్సర**ం ముగింపు సమయంలో **బిల్లుల కోసం వచ్చే** కాంట్రాక్టర్లు, ఇతరులతో **రద్దీగా కనిపించే ఖ**జానా కార్యాలయాలు నేడు **బోసిపోతున్నాయి.** బిల్లులు తీసుకోకపోవడంతో **ఎవరూ** ట్రెజరీ **కార్యాలయాలకు** రావడం మానే**శారు. దీంతో ఖజానా** సిబ్బంది సైతం ఖాళీ అయి**పోయారు.**

అన్నీ బంద్ : జిల్లాలో 32 డిపార్టుమెంట్లలో టెలి**ఫోన్, కరెంటు, స్టేషన**రీ బిల్లులు, ఇతర చెల్లింపులు **కూడా బంద్ అయ్యా**యి. అలాగే కార్యాలయం **నిర్వహణ ఖర్చులకు** కూడా చెల్లింపులు జరగడం లేదు. పలు శాఖల అధికారులు, ఉద్యోగులకు ఇచ్చే రవాణా భత్యం(టీఏ, డీఏ)లు, జీపీఎఫ్ బిల్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా నిలిపివేశారు. గతంలో అయితే ప్రభుత్వ శాఖలు ఇచ్చే బిల్లులను ట్రెజరీ శాఖ సిబ్బంది వాటిని సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేవారు. ప్రభుత్వ శాఖలో పలు అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు రోడ్డు ఎక్కారు. గత వారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వినతులు ఇవ్వగా.. మంగళవారం నగరంలో ఆందోళన చేపట్టారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు వివిధ విభాగాల కాంట్రాక్టర్లు ప్లకార్డులు చేతపట్టి నిరసన ర్యాలీ నిర్వహించారు.

బోసిపోతున్న కార్యాలయాలు

ఆర్థిక సంవత్సరం చివరిలో ట్రెజరీ కార్యాలయాలు బిల్లుల కోసం వచ్చే వారితో సందడిగా కనిపించేవి. ఈ సమయంలో సిబ్బంది అర్థరాత్రి సైతం విధులు నిర్వర్తించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు మాత్రం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉద్యోగుల జీతాలు, పింఛన్లు మినహా మిగిలిన అన్ని బిల్లులు నిలుపుదల చేయడంతో ట్రెజరీ సిబ్బంది ఖాళీ అయ్యారు.

ఆర్థిక సంక్షోభంలో పలు శాఖలు

పలు ప్రభుత్వ శాఖలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో అన్ని రకాల బిల్లులను నిలిపివేయాలని ప్రభుత్వం గత ఫిబ్రవరి నెలలో ఆదేశించింది. ఫలితంగా ఉద్యోగులకు సంబంధించిన బిల్లులతో పాటు కాంట్రాక్టు బిల్లులను నిలిపివేశారు. దీంతో నిధుల సంక్షోభంతో ప్రభుత్వ శాఖలు కటకటలాడుతున్నాయి.

ఆస్తిపన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

నెలాఖరులోగా చెల్లించే వారికే వర్తింపు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఆస్తిపన్నుపై విధించిన వడ్డీలో 50 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం జీవో నెం.46 జారీ చేసింది. 2024–25 ఏడాదికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను, ఖాళీ జాగా పన్నులు ఏక మొత్తంగా ఈ నెల 31లోగా చెల్లించిన వారు ఈ రాయితీని పొందవచ్చని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటికి సచివాలయ కార్యదర్శి వచ్చినప్పుడు డెబిట్/క్రెడిట్ కార్డు, యూపీఐ ద్వారా బకాయిలు చెల్లించవచ్చన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాల్లో ఉన్న సౌకర్యం కేంద్రాల వద్ద కూడా పని వేళల్లో చెల్లింపులు చేయొచ్చన్నారు. ఐడీబీఐ(సిరిపురం బ్రాంచ్), ఐసీఐసీఐ(ద్వారకానగర్ బ్రాంచ్), పంజాబ్ నేషనల్ బ్యాంక్(మధురవాడ బ్రాంచ్), యాక్సిస్(రామ్‌నగర్ బ్రాంచ్)బ్యాంకు శాఖల్లో కూడా పని దినాల్లో చెల్లించవచ్చని తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాల్లో పన్ను వసూలు కేంద్రాలు ఆదివారం, సాధారణ సెలవు రోజుల్లో కూడా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు.

హామీలు నెరవేర్చే వరకూ పోరాడుతాం..



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చిత్రంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కొండా రాజీవ్, విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, ఉత్తరాంధ్ర జోనల్ విభాగం అధ్యక్షుడు స్వరూప్ తదితరులు

- ఉద్యోగాలు, భృతి అంతా నాటకం
- ఉన్న పరిశ్రమలే వెనక్కి పోతున్నాయి
- త్వరలో మండల, గ్రామ స్థాయిలో యువజన విభాగం కమిటీల ఏర్పాటు
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా

సాక్షి, విశాఖపట్నం : ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసే వరకూ వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అందులో భాగంగానే వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటుచేశామని, త్వరలో మండల, గ్రామ స్థాయి యువజన విభాగం కమిటీలను కూడా ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. మంగళవారం మద్దిలపాలెంలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర యువజన విభాగం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. త్వరలో నియోజకవర్గ, మండల, గ్రామ యువజన విభాగం ఇన్‌చార్జిలను నియమించాలని దిశా నిర్దేశం చేశారు. అధికారం చేపట్టిన 10 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని, ప్రజలంతా ఎదురు తిరిగే రోజు అతి త్వరలో వస్తుందని జోస్యం చెప్పారు. ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇవ్వడం.. గెలిచిన తరువాత పంగనామాలు పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన చంద్రబాబు అండ్ కో.. అధికారం చేపట్టిన తరువాత ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా.? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమలే వెనక్కి వెళ్లిపోతున్న పరిస్థితులను చూస్తున్నామని మండిపడ్డారు. నిరుద్యోగులకు ప్రతీ నెలా రూ.3 వేలు భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేవరకూ మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం పోరాడుతూనే ఉంటుందని హామీ ఇచ్చారు.

రాజాకు సత్కారం

ఉత్తరాంధ్ర సమావేశానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను విశాఖ యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కొండారాజీవ్ గాంధీ, ఉత్తరాంధ్ర జోనల్ అధ్యక్షుడు మెంట స్వరూప్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల యువజన విభాగం అధ్యక్షులు మారపు పృథ్వీరాజ్, సూరిబాబు, వెంకటేష్, గవాడ శేఖర్, 66వ వార్డ్ కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో యాదవులకు సముచిత స్థానం

- కూటమి ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర యాదవులకు తీరని అన్యాయం
- జిల్లా యాదవ సంఘం నాయకులు



మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు ఒమ్మి కనకరాజు, పిన్నింటి ఆదిమూర్తి

సీతంపేట: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో యాదవులకు సముచిత స్థానం దక్కిందని, కూటమి ప్రభుత్వం కూడా అదే రీతిలో పదవులు కేటాయించి.. గౌరవించాలని జిల్లా యాదవ సంఘం నాయకులు ఒమ్మి కనకరాజు యాదవ్, పిన్నింటి ఆదిమూర్తి డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శ్రీకాకుళం జిల్లాలో ఓ ఎమ్మెల్సీ, విశాఖ జిల్లాలో ఓ ఎమ్మెల్సీ, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, జీవీఎంసీ మేయర్ ఇలా చాలా పదవులు యాదవులకు కేటాయించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉత్తరాంధ్రలో కనీసం జనాభా ప్రాతిపదికన కూడా రాజకీయ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కూటమి పార్టీలు యాదవులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుంటున్నాయని ఆక్షేపించారు. జీవీఎంసీ పరిధిలో 22 మంది కార్పొరేటర్లు యాదవులు ఉన్నారని, గత ప్రభుత్వం యాదవ మహిళకు మేయర్ పదవి కేటాయించి సముచిత స్థానం కల్పించిందన్నారు. మేయర్ పదవి నుంచి యాదవ మహిళను తొలగిస్తే తీవ్ర మానసిక ఆందోళన పెంచినట్లేనన్నారు. గత ఎన్నికల్లో కూటమి గెలుపునకు యాదవ సామాజిక వర్గం కృషి చేసిందని గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 16 లక్షల వరకు యాదవులున్నా, దానికి తగ్గట్టు ఎమ్మెల్సీలు, మంత్రి పదవులు దక్కలేదన్నారు. యాదవ నాయకులు యడ్ల వేణుగోపాల్‌కృష్ణ(సుమన్), నక్కా పద్మ, ఒమ్మి ఆనంద్, అల్లు రమణ, ఇసరపు వెంకటలక్ష్మి, చందక శ్రీను, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నీటి బిల్లు.. కళ్లు బైర్లు!

- మూడు రోజుల్లో రూ.96,915 కట్టాలని జీవీఎంసీ హుకుం
- ఒక్క పైసా కూడా బాకీ లేనంటున్న వినియోగదారుడు

తగరపువలస: తగరపువలసకు చెందిన వి.వెంకటేశ్వరరావుకు జీవీఎంసీ భీమిలి జోనల్ అధికారులు మంగళవారం జారీ చేసిన నోటీసు చూస్తే ఎవరికైనా కళ్లు బైర్లు కమ్మాల్సిందే! మూడు రోజుల్లో రూ.96,915 కట్టండి. లేకపోతే మీ తాగునీటి కుళాయి పీకేస్తాం.. ఇదీ ఆ నోటీస్ సారాంశం. ఆయనకు 1089002501 నంబర్‌తో తాగునీటి కుళాయి కనెక్షన్ ఉంది. అందుకు ఏడాదికి రూ.900 నీటి పన్ను చెల్లించాలి. కానీ జీవీఎంసీ అధికారులు దాదాపు ఒక శతాబ్దానికి పైగా నీటి బిల్లు బకాయి ఉన్నట్లు నోటీసులు జారీ చేయడం గమనార్హం. వాస్తవానికి 2024–2025 ఆర్థిక సంవత్సరం చివరి వరకు ఆయన నీటి పన్నులు చెల్లించేశారు. గతేడాది ఏప్రిల్ 26న రెండేళ్లకు గానూ రూ.1800 చెల్లించారు. అంతకు ముందు 2022–2023 ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి 15 ఏళ్లకు చెందిన రూ.13,500 బకాయిలు చెల్లించారు. ఈ నెల 31 వరకు జీవీఎంసీకి తాగునీటికి సంబంధించి ఒక్క పైసా కూడా బాకీ లేరు. వాస్తవానికి నీటి పన్నులకు సంబంధించి జీవీఎంసీ ఫైన్ విధించదు. ఎలాంటి బకాయిలు లేకుండా పన్నులు చెల్లిస్తే.. భయభ్రాంతులకు గురి చేసేలా నోటీసులు పంపించి తనని ఆందోళనకు గురి చేస్తున్నారని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జీవీఎంసీ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

అమ్మవార్లకు విశేష అలంకరణ




మజ్జివలస రాస పోలమాంబ | దాకమర్రి పైడితల్లమ్మ | రేవిడి జట్లమ్మ

భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను మంగళవారం ఆలయ కమిటీ బూందీ ప్యాకెట్లు, జర్బరా పువ్వులు, గజమాలలతో అలంకరించింది. 99వ అలంకరణ సందర్భంగా ఈ విధమైన ఏర్పాట్లు చేయగా, రౌతువారి కళ్లాలకు చెందిన రౌతు అప్పలనాయుడు, రాజేశ్వరి దంపతులు సహకరించారు. దాకమర్రి పంచాయతీ పైడితల్లమ్మ దేవర సందర్భంగా అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు నెమలి పింఛాలతో అలంకరించారు. పద్మనాభం మండలం రేవిడి జట్లమ్మను పసుపు-కుంకుమ ప్యాకెట్లతో అలంకరించారు. ఈ అలంకరణకు తిప్పల జ్యోతి సహాయ సహకారాలు అందించగా, పిన్నింటి రాజ్‌కుమార్‌రెడ్డి అలంకరణ పూర్తి చేశారు.

- తగరపువలస

కారు చీకట్లో కానరాని దారులు.. కొవ్వొత్తుల వెలుగులో విద్యార్థుల చదువులు.. కట్టెల పొయ్యి నుంచి వచ్చే వెలుతురులోనే మహిళల వంటలు.. ఆరు బయట ముసురుకున్న చీకట్లోనే కుటుంబాల భోజనాలు.. ఫ్యాన్ గాలి లేని నిద్రలు.. చుట్టూ నిత్యం బుసలు కొట్టే పాములు.. ఇవీ చిమ్మ చీకట్లో నిత్యం పిల్లా పాపలతో బర్థన్‌నగర్ వాసుల బతుకులు..


బర్థన్‌నగర్‌లో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో కొవ్వొత్తుల వెలుగులో చదువుకుంటున్న విద్యార్థులు

చీకటి బతుకులు

కనీస మౌలిక వసతులు లేక అల్లాడిపోతున్న బర్థన్‌నగర్ వాసులు

- విద్యుత్ సదుపాయం లేక చిమ్మ చీకట్లో అవస్థలు
- రేయింబవళ్లు చీకట్లో విష కీటకాలతో సావాసం
- అంగన్‌వాడీ, పాఠశాలలకు దూరాభారం
- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన కూటమి నేతలు

పెందుర్తి: నగరంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన జీవీఎంసీ 97 సుజాతనగర్‌కు అతి సమీపంలో వెలసిన బర్థన్‌నగర్ కనీస మౌలిక వసతులకు నోచుకోలేదు. ఇళ్లల్లో పనులు చేసుకుంటూ.. తాపీ మేస్త్రీలుగా.. ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న దాదాపు 120 కుటుంబాలు దాదాపు పుష్కర కాలం క్రితం ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. చిన్నపాటి గుడిసెలు, షెడ్లు వేసుకుని జీవిస్తున్నారు. అయితే ఈ కాలనీలో జీవీఎంసీ వేసిన రెండు తాగునీటి బోర్లు తప్ప ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు అందలేదు. ముఖ్యంగా విద్యుత్ సదుపాయం లేక వీరి జీవితాలు నరకప్రాయంగా మారాయి. ఇక్కడి పిల్లలకు పాఠశాలలకు వెళ్లేందుకు కూడా తగిన సదుపాయాలు లేవు. అంగన్‌వాడీ కూడా కాలనీకి మూడు కిలోమీటర్ల దూరంగా ఉండడంతో ఐదేళ్లలోపు పిల్లలు ఇంట్లోనే ఉండిపోయే దుస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే బర్థన్‌నగర్ వాసుల అవస్థలు చంతాడంతా ఉన్నాయి.


కనీస వసతులు లేని బర్థన్‌నగర్ కాలనీ

సూర్యాస్తమయంతో కష్టాలు మొదలు

బర్థన్‌నగర్‌లో దాదాపు 120 కుటుంబాలు ఉంటున్నాయి. వీళ్లలో అధిక శాతం మంది సమీపంలోని ఉన్నత వర్గాల ఇళ్లల్లో పనులు చేస్తూ పొట్ట పోసుకుంటారు. మిగిలిన వారు తాపీ మేస్త్రీలుగా, కూలీలుగా, ఆటో కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. కాగా కాలనీ వాసులు పగటిపూట ఏదోలా నెట్టుకొచ్చినా.. సూర్యాస్తమయం తరువాత కష్టాలు మొదలవుతాయి. పనుల మీద బయటకు వెళ్లిన వారు పొద్దుపోయాక వచ్చేటప్పుడు మార్గం చిమ్మ చీకటిగా ఉంటుంది. ఇంట్లో వంటలు చేయాలంటే కట్టెల పొయ్యి వెలుగే దిక్కు. ఇక విద్యార్థుల చదువులు కొవ్వొత్తుల వెలుతురులోనే సాగుతున్నాయి. నిత్యం విష కీటకాలు భయంతో కునుకు తీయాల్సిన దుర్భర జీవితం వీరిది.

అప్పుడు ఓట్లడిగి.. ఇప్పుడు మోకాళ్లడ్డు

దాదాపు 12 ఏళ్ల క్రితం ఏర్పడిన బర్థన్‌నగర్ వాసులకు ఆధార్, ఓటరు కార్డులు ఇక్కడి చిరునామాతోనే ఉన్నాయి. గ్యాస్ కూడా బర్థన్‌నగర్ చిరునామాతోనే సరఫరా అవుతుంది. 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చొరవతో జీవీఎంసీ అధికారులు ఇక్కడ నివాసం ఉంటున్న కొందరికి ఇంటి పన్నులు కూడా వేశారు. ఈ క్రమంలో విద్యుత్ సదుపాయం, ఇతర వసతుల కల్పనకు జీవీఎంసీ అధికారులు పూనుకున్నారు. ఎన్నికలు సమీపించడంతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ క్రమంలో 2024 ఎన్నికల సమయంలో కాలనీకి ప్రచారానికి వచ్చిన కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే సకల సదుపాయాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. తీరా అధికారంలో వచ్చాక ఇక్కడ సదుపాయాలు కల్పించాలంటే కాలనీవాసులంతా కలిసి రూ.40 లక్షలు ఇవ్వాలని ఓ ప్రజాప్రతినిధి డిమాండ్ చేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. నిరుపేదలైన తమకు కనీస మౌలిక వసతుల కల్పనకు కూడా ఈ తరహాలో ప్రవర్తించడం పట్ల వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తమకు విద్యుత్ సదుపాయంతో పాటు ఇతర వసతులు కల్పించాలని కోరుతున్నారు.


కనీస వసతులు కల్పించాలని ఇటీవల ఆందోళన చేసిన బర్థన్‌నగర్ వాసులు


విద్యుత్ సదుపాయం లేకపోవడంతో చీకట్లో ఉన్న బర్థన్‌నగర్ వాసులు

మొహం చాటేశారు


2023లో తొలుత 13 మందికి ఇంటి పన్ను వేశారు. మిగిలినవారికి త్వరలో వేస్తామని చెప్పారు. అయితే ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికలప్పుడు స్థానిక టీడీపీ నాయకులు వచ్చి ఓట్లేస్తే అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాకు రూ.40 లక్షలు ఇస్తేనే చేస్తామంటున్నారు. కలెక్టర్, జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకుని మా కష్టాలు తీర్చాలి.
–నారాయణపురం అరుణ, బర్థన్ నగర్

జీవితం దుర్భరంగా ఉంది


మేమంతా ఇళ్లల్లో పనులు, భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయంటే రెండు బోర్లు వేశారు. కానీ విద్యుత్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి పూట నిద్ర పట్టడం లేదు. – మట్టా అనురాధ, బర్థన్‌నగర్

కొవ్వొత్తుల వెలుగులోనే చదువు


నేను రోజు మా కాలనీ నుంచి పెందుర్తి వెళ్లి చదువుకుంటున్నాను. పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక చదువుకుందామంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. పరీక్షల సమయంలో అయితే నరకమే. కొవ్వొత్తుల వెలుగులో చదువుకుంటున్నాం. – ఆశ, విద్యార్థిని, బర్థన్‌నగర్

పాములు, తేళ్లతో భయం భయం


మా ప్రాంతంలో జీవీఎంసీ వేసిన రెండు బోర్లు తప్ప ఏమీ లేవు. రోడ్డు ఊసే లేదు. విద్యుత్ లేకపోవడంతో బాధలు పడుతున్నాం. రాత్రుళ్లు కంటి మీద కునుకే ఉండడం లేదు. పాములు, తేళ్లు మా ముందే తిరుగుతున్నాయి. భయమేస్తుంది.
– గొద్దు నారాయణమ్మ, బర్థన్‌నగర్

అంగన్‌వాడీకి పంపలేని పరిస్థితి


చాలా ఏళ్లుగా ఇక్కడే చిన్న షెడ్ వేసుకుని ఉంటున్నాం. విద్యుత్ సదుపాయం లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు ఈగలతో చాలా కష్టపడుతున్నాం. దూరాభారం వల్ల పిల్లలను అంగన్‌వాడీలకు పంపించలేకపోతున్నాం. – షేక్ మహావజా, బర్థన్‌నగర్

ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గం

పెందుర్తి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా కె.అప్పలనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా కె.వి.ఎం రాజు, ఉపాధ్యక్షుడిగా డి.రవితేజ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.జగన్నాథ, ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంఘం కృషి చేస్తుందని అధ్యక్షుడు అప్పలనారాయణ తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటుకు దరఖాస్తులు

విశాఖలీగల్: జిల్లా కోర్టు ఆవరణలో క్రిమినల్ కోర్టు భవన సముదాయంలో క్యాంటీన్ ఏర్పాటు కోసం ఆసక్తి గల వారు సంప్రదించాలని విశాఖ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.నరేష్ కుమార్ తెలిపారు. నెలకు రూ.30 వేలు అద్దె, రూ.90 వేలు అడ్వాన్స్ చెల్లించాలని పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీలోగా విశాఖ బార్ అసోసియేషన్ కార్యాలయంలో కార్యదర్శికి దరఖాస్తు అందజేయాలని సూచించారు.

28నే బార్ అసోసియేషన్ ఎన్నికలు

- కొత్తగా చేరిన వారికి ఓటు హక్కు లేదు
- స్పష్టం చేసిన న్యాయవాద సంఘం

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఈనెల 28న యథాతథంగా జరుగుతాయని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది జి.ఎం.రెడ్డి వెల్లడించారు. 'ప్రశ్నార్థకంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు' శీర్షికతో 'సాక్షి' మంగళవారం ఓ వార్తను ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన జి.ఎం.రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్‌లో ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేశారు. మరోవైపు కొత్తగా చేరిన న్యాయవాదులకు ఓటు హక్కు లేదని బార్ అసోసియేషన్ తెలిపింది. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు 2,970 న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. 28వ తేదీ ఉదయం 10 గంటలకు ఎన్నికల పోలింగ్ మొదలై సాయంత్రం 4.30కు పూర్తవుతుంది. అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై రాత్రి పది గంటలకు తుది ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. అభ్యర్థులందరూ తమ ప్రచారాన్ని కొనసాగించుకోవచ్చని, ఏమైనా సందేహాలు ఉంటే తనను నేరుగా సంప్రదించాలని జి.ఎం.రెడ్డి సూచించారు. కాగా.. ఎన్నికలపై స్పష్టత రావడంతో అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. ముఖ్యంగా అధ్యక్ష, కార్యదర్శి పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతీ న్యాయవాదిని వ్యక్తిగతంగా కలుస్తున్నారు. తమ అజెండాతో పాటు న్యాయవాదుల సంక్షేమానికి అందించే సేవల గురించి వివరిస్తున్నారు.

గురుకులం ప్రవేశ పరీక్ష 13కు వాయిదా

ఆరిలోవ: జీవీఎంసీ పరిధి శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈ విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల కోసం జరగాల్సిన పరీక్షల తేదీని మార్పు చేసినట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6న జరగాల్సిన ఈ పరీక్షను, 13కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాల్సిందిగా కోరారు.

రైల్వే జోన్ పనుల అడ్డగింత

న్యాయం చేయాలని శ్రీకృష్ణాపురం గిరిజనుల ఆందోళన


రైల్వే జోన్ పనులు అడ్డుకుంటున్న శ్రీకృష్ణాపురం గిరిజన మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి ముడసర్లోవ వద్ద రైల్వే జోన్ పనులను మంగళవారం శ్రీకృష్ణాపురానికి చెందిన గిరిజనులు అడ్డుకున్నారు. ముడసర్లోవ ప్రాంతంలో 52 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం రైల్వే జోన్ కోసం కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇక్కడ కాంట్రాక్ట్ సంస్థ భూసార పరీక్షలు చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. పొక్లెయిన్ ద్వారా పనులు జరగనివ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ఈ భూములు రైల్వేకు కేటాయించారని, వెంటనే ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. 1976లో అప్పటి కేంద్ర ప్రభుత్వం శ్రీకృష్ణాపురంలో 66 గిరిజన కుటుంబాలకు 66 ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించిందని వారు తెలిపారు. ఆ భూమిని ఇప్పుడు రైల్వేకు కేటాయించడం అన్యాయమన్నారు. ఈ భూములు తీసుకున్నందుకు తమకు ప్రత్యామ్నాయం చూపాలని, అప్పటి వరకు పనులు జరగనివ్వమని హెచ్చరించారు.

పత్తా లేని టీడీపీ నాయకులు


రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు రైల్వే అధికారులు ఈ భూములకు హద్దులు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో శ్రీకృష్ణాపురం గిరిజనులతో కలిసి టీడీపీ నాయకులు ఆందోళనకు దిగారు. గిరిజనులకు ప్రత్యామ్నాయం చూపకుండా పనులు జరపకూడదని డిమాండ్ చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పనులు జరుగుతుండగా టీడీపీ నాయకులు పత్తా లేకుండా పోయారు. ఇక్కడ గిరిజనులను రాజకీయంగా ఉపయోగించుకుని అవసరం తీరిన తర్వాత ముఖం చాటేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కనీస పెన్షన్ కోసం దేశవ్యాప్త ఉద్యమం


మాట్లాడుతున్న అశోక్ రావత్

గాజువాక: విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.7,500, డీఏ, మరో పక్క హయ్యర్ పెన్షన్ కోసం దేశవ్యాప్త ఉద్యమం నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ నేషనల్ ఏజిటేషన్ కమిటీ జాతీయ నాయకుడు కమాండర్ అశోక్ రావత్ తెలిపారు. వైజాగ్ నేషనల్ ఏజిటేషన్ కమిటీ ఆధ్వర్యంలో గాజువాకలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘకాలం పాటు తమ సేవలను అందించి రిటైరైన ఉద్యోగులకు కనీస పెన్షన్, డీఏతోపాటు రెండు హెల్త్ కార్డులను కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఒక పక్క కనీస పెన్షన్ కోసం పోరాడుతూనే మరోపక్క హయ్యర్ పెన్షన్ కోసం కూడా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అందరూ సమైక్యంగా పని చేస్తే హక్కులను సాధించుకోగలుగుతామన్నారు. దీనిపై ఇప్పటికే పీఎఫ్ సెంట్రల్ కమిటీతో మాట్లాడినట్లు చెప్పారు. వెయ్యి రూపాయల పెన్షన్ తీసుకుంటున్న అనేక మంది విశ్రాంత ఉద్యోగులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. నేషనల్ ఏజిటేషన్ కమిటీ అధ్యక్షుడు బాబూరావు మాట్లాడుతూ కనీస పెన్షన్ కోసం అవసరమైతే పీఎఫ్ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామన్నారు. కార్యదర్శి ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కనీస పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి కాలయాపన చేస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ఈ విషయంపై పార్టీలకతీతంగా ఉద్యమం చేపట్టాలన్నారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేస్తోందని, ఏ వర్గానికీ ఉపయోగపడటం లేదన్నారు. ఐఎన్‌టీయూసీ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ పెన్షన్ పోరాటంలో అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేషనల్ ఏజిటేషన్ కమిటీ ప్రతినిధులు సరితా నార్కడ్, శోభా అరసు తదితరులు పాల్గొన్నారు.

బై.. బై.. ఎల్ఎస్‌జీ


విమానాశ్రయానికి చేరుకుంటున్న ఎల్ఎస్‌జీ జట్టు

గోపాలపట్నం: ఓటమి భారంతో లక్నో సూపర్ జెయింట్స్(ఎల్ఎస్‌జీ) జట్టు హైదరాబాద్‌కు పయనమైంది. ఐపీఎల్‌లో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో సోమవారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఎల్ఎస్‌జీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దీంతో జట్టు తమ తదుపరి మ్యాచ్ ఆడేందుకు విశాఖ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. క్రికెటర్లకు అభిమానులు వీడ్కోలు పలికారు.

పర్యవేక్షణ లోపం.. రోగులకు శాపం

- మెడికల్ షాప్‌లు, ఏజెన్సీల్లో అడుగడుగునా అక్రమాలు
- కాలం చెల్లిన మందులు విక్రయిస్తూ ప్రాణాలతో చెలగాటం
- విజిలెన్స్, పోలీస్, ఈగల్, డ్రగ్ కంట్రోల్ బృందాల తనిఖీల్లో వెల్లడి


నగరంలో మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

మహారాణిపేట: వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణ లోపం రోగుల పాలిట శాపంగా మారింది. కాలం చెల్లిన మందుల విక్రయాలు, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తునిచ్చే మందులు, ఇంజక్షన్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన మెడికల్ షాపులు, ఏజెన్సీలు అడ్డగోలుగా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా.. అధికార యంత్రాంగం పట్టించుకోని పరిస్థితి.

నిబంధనలు బేఖాతరు

ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపు 3 వేల మందుల షాపులు, 1,400 మెడికల్ ఏజెన్సీలు, హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. వీటిలో చిన్న చిన్న షాపుల్లో ఎలాంటి కంప్యూటర్లు, రిజిస్టర్లు లేకుండానే మందుల విక్రయాలు జరుగుతున్నాయి. నిబంధనల మేరకు ప్రతి మందుల షాపులో ఫార్మసిస్టు ద్వారానే మందుల విక్రయాలు జరగాలి. కానీ ఎక్కడా ఈ నిబంధన అమలు జరగట్లేదు. అయినా ఔషధ నియంత్రణ మండలి అధికారులు మాత్రం దృష్టి సారించరు. నెలనెలా తూతూ మంత్రపు తనిఖీలతో 'మామూళ్ల'గా మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. తరచుగా జరపాల్సిన తనిఖీలు జరగకపోవడంతో చాలా మందుల షాపులు కనీస నిబంధనలను కూడా పాటించట్లేదు. కాలం చెల్లిన మందుల్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.

అడ్డగోలుతనం బట్టబయలు

మెడికల్ షాపుల అడ్డగోలుతనంపై ఆరోపణల నేపథ్యంలో ఇటీవల విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ కింజరాపు ప్రభాకర్, ఈగల్(ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), డ్రగ్ కంట్రోల్, ఇతర విభాగాలకు చెందిన 40 మంది సభ్యులతో కూడిన 4 బృందాలు మందులు షాపులు, ఏజెన్సీల్లో తనిఖీలు చేపట్టాయి. ఆరిలోవ, అల్లిపురం, లీలా మహల్, డాబాగార్డెన్స్, కైలాసపురం, కూర్మన్నపాలెం, గాజువాక, అనకాపల్లి, ఎంవీపీ కాలనీ తదితర ప్రాంతాల్లో దుకాణాలను తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్న ఎంవీపీ కాలనీలోని త్యాగరాయ మెడికల్స్, గాజువాకలోని శ్రీ సాయి వెంకటేశ్వర మెడికల్స్‌లో మందులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కనీస నిబంధనలు పాటించని మరో 13 షాపులకు నోటీసులిచ్చి సరిపెట్టారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.89,290
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.81,850
వెండి(కిలో):	రూ.1,10,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.108
స్కిన్	: రూ.186
స్కిన్‌లెస్	: రూ.196

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	400.00
విజయనగరం	404.00
శ్రీకాకుళం	404.00

పోదాం పదే యాతర.. నూకాలమ్మ జాతర

- నెల రోజులు వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు
- రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 28, 29 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనుంది. 28న జాతర, 29న కొత్త అమావాస్య పండగ, 30న ఉగాది వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. నెల రోజులపాటు జరగనున్న జాతర ఏప్రిల్ 27వ తేదీతో ముగుస్తుంది. అమ్మవారు కొలువై ఉన్న బాలాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేసవి కావడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్లను సిద్ధం చేశారు. మంచినీటి కూలర్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లను కలెక్టర్ విజయ కృష్ణన్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లబాబు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను నిరంతరం పరిశీలిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో మరింత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది ఆలయ పరిసరాల్లోనే ఈ పండగ వాతావరణం కనిపించేది. ఈసారి పట్టణం నడిబొడ్డున ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో కూడా ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాగణంలో భారీ వేదిక రూపొందించి భక్తులందరికీ కనిపించేలా అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పనున్నారు. ఈ అమ్మవారి విగ్రహానికి రెండు పూటలా ప్రత్యేక పూజలు చేయడానికి కూడా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే స్టేడియం పరిసరాలను పల్లెటూరి వాతావరణం ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతున్నారు.

జెయింట్‌వీల్, మూవింగ్ ట్రెస్, రన్నింగ్ షిప్, పిల్లలు ఆడుకొనే వివిధ రకాల వస్తువులు, తినుబండారాల స్టాల్స్ నెలకొల్పనున్నారు. ఆధ్యాత్మికత ప్రతిఫలించేలా సంకీర్తనలు, కోలాటం, జానపద నృత్యాలను నెల రోజులపాటు నిర్వహించనున్నారు. నెల రోజుల జాతర కోసం ఎన్టీఆర్ స్టేడియంలో నెలకొల్పే 12 అడుగుల అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం గవరపాలెం పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.


ఎన్టీఆర్ స్టేడియంలో నెలకొల్పే అమ్మవారి ఉత్సవ విగ్రహం